రాగమ్మ

శ్రీమతి ఆర్. వసుంధర

'ఇంటి తలుపు బార్లా తీసుందేమిట్చా. అమ్మా, బాబా ఎవ్వరూ వెళ్లలేదేంటి' అనుకుంది రాగమ్మ రోడ్డుమీదనుండి తమ పూరింటివేపు చూసి. కోమటామె యిచ్చిన చద్దన్నం గిన్నె చిన్న పులుసుగిన్నె ఒకదానిమీద వొకటి పెట్టుకొని ఎడమ అరిచేతిలో భుజం మీదుగా ఎత్తి పట్టుకుని అప్పుడే యిళ్ల పనులు ముగించుకొని తిరిగొస్తోంది పదిహేనేళ్ల రాగమ్మ.

సినిమా హాలుకు ఎదురుగ్గా రోడ్డుకు ఆవలివేపున గజం లోతు పల్లంలో తీరూ తెన్నూ లేకుండా వీలునుబట్టి తలకో ప్రక్కకు ముఖం పెట్టి చిక్కుంరొక్కురుగా కట్టబడ్డ పూరిళ్లలో ముందుగా రోడ్డు దగ్గరగా వున్నది రాగమ్మ యిల్లు. డబ్బు యిబ్బందులవలన రెండేళ్లనుండీ వరి గడ్డి కప్పించనందున కప్పు పాతబడి నల్లబడి కొంత కొంత ఎగిరిపోయి అక్కడక్కడా తాటాకులు కన్పిస్తున్నాయి. దాదాపుగా అన్ని యిళ్లూ ఆ స్థితి లోనే ఉన్నాయి. ఆ యిండ్లకు వెనుకవైపున యిరవై గజాల దూరంలో వూరి మురుగంతా చేరుతుంది. వాటికీ వూరికీ మధ్య నున్న కాస్త ఖాళీ స్థలమూ, చీకటిపడ్డ తర్వాత వూరివారికి కక్కసు దొడ్డిగా ఉపయోగపడుతుంది. ఇదివరలో వూరి నడిబొడ్డులో పారిన మురికి కాలువ చోటు మార్చుకుంటూ దక్షిణంగా జరిగి జరిగి ఆ స్థలాన్ని వూరివారి ఉపయోగాని కిచ్చింది. ఆ చోటు పెద్ద రెడ్డిగారి స్వంతం అయింది. ఆయన దాతృత్వాన వాళ్లు అక్కడ పూరిళ్లు వేసుకున్నారు. స్థలాన్ని మెరక చెయ్యడానికి రెడ్డిగారు పూనుకోలేదు. వాళ్లకు చేసుకునే స్తోమత లేదు. పంచాయితీ వాళ్లు ఏడాది కోమారు మూడు రూపాయిలు పన్ను కట్టించు కోవడం మినహాగా వాళ్లజోలి పట్టించుకోరు. వాళ్లందరూ రెడ్డి గారి ఆశ్రితజనంలోనివాళ్లు. వారి వదాన్యతకు కృతజ్ఞులై వుండి ఎప్పుడో ఒకసారి ఎలక్షన్లు వచ్చినప్పుడు వారి అభ్యర్థికి వోటు వెయ్యడం మినహాగా మరేమీ చెయ్యలేని చిన్న మనుష్యులు.

నిజంగా రెడ్డిగారు చాలా మంచివారు. వాళ్లకి అత్యవసర మైనప్పుడు తక్కువ వడ్డీకి అప్పు యిస్తారు. వూళ్లోని మిగతా పెద్దల్లాగా సమయం దొరికిందే చాలని ఇరవై రూపాయిల వడ్డీతో వాళ్లకి వూపిరి సలుపనివ్వని వురి వెయ్యరు. కూలి నాలి చెయ్యగలవాళ్లకు వారి చేలలోనే పని యిస్తారు. ఈమధ్యనే ఎవరెవరు యిళ్లు వేసుకున్న స్థలాల్ని వాళ్లే అతి చవకలో అంకణం ముప్పై రూపాయిల లెక్కన స్వంతం చేసుకోవచ్చునని చెప్పారు. ఇంకో పదేళ్లపాటు అల్లానే గడిపితే చట్టం ప్రకారంగా డబ్బు కట్టకుండానే స్థలం వాళ్లకే చెందిపోతుందని రెడ్డిగారంటే కిట్టనివాళ్లు సలహా యిచ్చినా వినక, ఏ కార్యానికో కూడబెట్టు కున్నది కాస్తో కూస్తో మూలధనం గలవాళ్లు నలుగురైదుగురు దస్తావేజులు వ్రాయించేసుకున్నారు. అలాంటి స్వంత దార్లలో రాగమ్మ తల్లి సుబ్బమ్మ ఒకతె. రాగమ్మ పెళ్లికని చేర్చిన రెండొం దలూకాక అప్పు చేసిన వందతో కలిపి మూడొందలకు యిల్లు నాదనిపించుకున్నది. దానితో చేతనున్న డబ్బు పోవటమేకాక అప్పు కటి మీద పడ్డది. ఇల్లు స్వంతం చేసుకున్నందుకు మరో ఫలితంగా రోజుకు రెండు మూడు తగాదాలు పెట్టుకోవలసి వస్తున్నది. వాళ్ల తాలూకు మురుగునీరూ బూడిదా కసువూ తమ స్థలంలోనికి వచ్చాయని యిరుగు పొరుగులతోను, రాత్రి సినిమా వదిలినప్పుడు హాలుకు ఎదురుగా రోడ్డు కీవలగా సరిగ్గా సుబ్బమ్మ యింటిపైగా అత్యవసరంగా కాలకృత్యాలు తీర్చుకో వలసి వచ్చిన పిన్నలు పెద్దలతోనూ వున్నట్లుండి యుద్ధం ప్రారంభమవుతుంది సుబ్బమ్మకు. పెద్దగా అరచుకోవడాలూ, తిట్టుకోవడాలూ అయ్యాక యింట్లోకి వచ్చిన సుబ్బమ్మకి మొగుడిమీదా, కూతురిమీదా తగనికోపం వస్తుంది. వాళ్లిద్దరూ యీ పోట్లాటలలో కలుగజేసుకోరు. సుబ్బమ్మకు తోడుగా మాట్లాడరు. ఇంటి మంచి చెడ్డలు వాళ్ల కెందుకు కాబట్టవో సుబ్బమ్మకు అర్థంకాదు. గుడ్డోడి సంగతి ఒదిలేసినా చేతికంది వచ్చిన పిల్లకీ నిర్లక్ష్యం ఉండటం సుబ్బమ్మకు గిట్టదు. 'బాబూ కూతురూ నాలిముచ్చులు. కర్మకొద్దీ దొరికారు' అంటూ తలబాదుకొంటుంది కసిపట్టలేక. అమ్మ కోపాలు తాపాలూ రాగమ్మ లెక్క చెయ్యదు నవ్వుకుంటూ తన పని తాను చేసుకుంటుంది. రాగమ్మ కళ్లు పెద్దగా గుండ్రంగా మెరుస్తుంటాయి. ముక్కు సన్నగా చిన్నగా వుంటుంది. పెదాలు వాజూగ్గా ఒంపు దిరిగి చక్కటి పలువరుసమీద ఉల్లాసంగా నవ్వుతుంటాయి. రాగమ్మ చామనచాయలో వయసూ నవ్వూ కూడబలుక్కొని ఏర్పాటు చేసిన నిగారింపు వున్నది. ఆ పిల్ల పేదరికాన్ని పట్టిచ్చే భాగాలు పాచిపనివలన కాస్త మొరటుదేరిన చేతులూ, వెడల్పుగా పెద్దగా వుండే పాదాలూను. రాగమ్మ పని చేస్తున్న యింటి కోమటామె తన కూతురివి, వెలిసిపోయి పాత బడినవి, పావడాలూ ఓణీలు రాగమ్మ కిచ్చి, ఆ పిల్ల ఒంటిమీద చూశాక 'యింత చక్కటి గుడ్డలు ఎందుకిచ్చానా' అని బాధపడ్డ సందర్భాలున్నాయి. జీవం ఆనందం తొణికిసలాడే రాగమ్మ అడివి పువ్వు. ఆకుగాని పచ్చదనం లేశంగాని లేని మోడులాంటి చెట్టుకు పూసే పువ్వు.

ఎడంచేతిలోవున్న గిన్నెలు జారకుండా వాటిమీద కుడి చెయ్యి బరువుపెట్టి పరుగులాంటి నడకతో రోడ్డుక్రింది పల్లం లోకి దిగి యింట్లోకి వెళ్లింది రాగమ్మ. అనుకున్నట్లుగానే అమ్మా బాబూ యిద్దరూ యింట్లోనే ఉన్నారు. తడిక వారగా చాపమీద యిద్దరు ఆడవాళ్లు కూర్చొని వున్నారు. కాస్తవతల

కుక్కి అయిన నులకమంచంమీద ఇరవైఏళ్ల అబ్బాయి కూర్చున్నాడు. ఆడవాళ్లలో ఒకామె ఉత్తరపు వీధిలో కొత్తగా మిద్దె యిల్లు కట్టుకున్న కాంతమ్మ అని గుర్తించింది రాగమ్మ. రెండో ఆమె రంగు అద్దిన రేకును కట్టుకుని కుచ్చెళ్లు ఎగదోపుకున్నది. గ్లాస్కోమల్లు రైక కొత్తది వలచగా, తెల్లగా నాజూగ్గా వున్నది. మోకాళ్లు ఎత్తి పెట్టుకుని చుట్టూ చేతులు తేలిగ్గా బిగించి హుందాగా కూర్చున్నది ఆవిడ. ఇంట్లోకి వచ్చిన రాగమ్మని పరిశీలనగా చూసింది.

మంచంమీద కూర్చున్న అబ్బాయి పీలగా చామనలపులో వున్నాడు. బాగా చమురు పూసిన పలచటి జుట్టు మొహమ్మీదికి దారాల్లాగా వేళ్లాడుతున్నది. వరుసగానే వున్నా కొంత పొడుగ్గావున్న పళ్లవలన నవ్వకపోయినా నవ్వుతున్నట్టు కనిపిస్తాడు. ఈ అబ్బాయీ రాగమ్మని పరిశీలించి చూశాడు. 'శానా బాగుందే సినిమా ఏక్టరులాగా' అనుకుని తల పంకించుకున్నాడు.

'కాసిని నీళ్లు పొయిలో ఏసి కోమిటి రత్తయ్య దగ్గిరికెళ్లి బేడ కాపీపొడి పట్టుక రా. డబ్బులు మళ్లీ యిత్తానని సెప్పు. అట్టాగే రాజమ్మ దగ్గర నవటాకు పాలు బోయించకరా' అని కూతురికి చెప్పింది సుబ్బమ్మ.

కాఫీలయ్యాక 'పిల్ల మరీ అబ్బనాకారంగా వుంది' అన్నది రేకు కట్టుకున్నావిడ కాంతమ్మతో. 'పోషణ సరిలేకనే, శేషమ్మా' అన్నది కాంతమ్మ. అందరూ వెళ్లడానికి లేచారు. వాళ్లేమంటారోనని ఆశగా ఆత్రంగా చూస్తాంది సుబ్బమ్మ. 'ఇంటికి బోయి మా అన్నదమ్ముల్తో మాటాడి ఏ మాటా తెలుపుతాము' అన్నది రేకు కట్టుకున్న శేషమ్మ. 'పర్లేదు....మాట్టాడు' అన్నాడు అబ్బాయి. శేషమ్మ కొడుకుని కొరకొరా చూసింది. అది లెక్క జెయ్యకుండా చమురుతో తళతళ్లాడుతున్న జుట్టును మొహమ్మీదనుండీ వెనక్కిపోయేట్టు తల ఎగరేసి 'పర్లేదు..... మాట్టాడు' అన్నాడు అబ్బాయి.

వాళ్లని చూస్తుంటే రాగమ్మకి నవ్వు ఆగలేదు. తడికవతలికి వెళ్లిపోయింది.

శేషమ్మ లేచి నవ్వు తెచ్చిపెట్టుకుంటూ 'మా శంకరానికి పిల్ల నచ్చిందమ్మోవ్' అన్నది.

* * *

శేషమ్మకు శంకరం ఒక్కడే సంతానం. నెల్లూరినుండి అంకమ్మ తిరునాళ్లకని యీ పల్లెటూరికి తెలిసిన వాళ్లింటికి వచ్చింది కొడుకుతో సహా. వారూ వీరూ చెప్పగా పనిలో పనిగా రాగమ్మను చూసింది. వాళ్ల యిల్లూ తీరూ ఏదీ ఆమెకు నచ్చలేదు. మరీ తూగని సంబంధం అనుకుంది. ఆ పేదరికం చూచి ఏవగించుకున్నది. కాని శంకరం పట్టుపట్టాడు. పెళ్లిరోజంతా శేషమ్మ మొహం మాడ్చుకునే వున్నది.

తీరా పెళ్లి జరుగుతున్నప్పుడు యింకో విషయం బయట కొచ్చింది. రాగమ్మ బాబు గుడ్డోడు రోజూ సాయంత్రాలూ నలుగురూ పోగయ్యే పోలీసు స్టేషను ముందరి వేపచెట్టు దగ్గర వంచెగుడ్డ క్రింద పరచుకుని కూర్చుని తత్వాలు పాడుతూ సిగ్గులేకుండా.....అడుక్కుంటూడట! శేషమ్మకి ఒంటినిండా తేళ్లూ జెర్రులూ ప్రాకినై. ఉక్రోషంతో శోకాలు పెడుతూ పెద్దగా అరిచింది. ఆమెకంటే పెద్దగానే అరిచింది సుబ్బమ్మ మొగుడి మీద. 'నే జెప్తే సెవి నేసుకోకపోతివి. సిగ్గుమాలినోడా. నలుగురూ వూస్తుండారు సూడు. ఇగ పిల్లగతి ఏమైపోతాది' అంటూ ఏడిచింది. గుడ్డోడు రవణయ్య దిగాలబడిపోయాడు. తన మూలాన కూతురి పెళ్లికి యిబ్బంది కలుగుతుందని అనుకోలేదు. 'దేవుడు సిన్న సూపు జూసి యిట్టాగయిపొయ్యాను గాని ముందంతా లచ్చనంగా నేత పని జేసుకోని కట్టం సెయ్యలా నేను! రెక్కలు దాసుకున్నానా? ఏవీ సెయ్యలేని అప్రయోజకుణ్ణయిపొయ్యానే అని దీనికి తలపడ్డాను' అంటూ గుడ్ల నీరెట్టుకున్నాడు. రాగమ్మ లేచివచ్చి బాబును కావలించుకుంది. 'నాకీ పెళ్లొద్దులే అయ్యా' అని బావురుమన్నది. నలుగురూ కలగజేసుకుని 'యిదివరల్లో వాళ్లూ బాగా బతికినోళ్లే'నని నచ్చజెప్పి పెళ్లి అయిందనిపించారు.

చిన్న ట్రంకు పెట్టెలో రెండు సాదాచీరెలూ, నలభై రూపాయిలకో పట్టుచీరె పెట్టుకుని బయల్దేరబోతున్న రాగమ్మని చాటుకు పిల్చుకుపోయి ఎవరికీ తెలియకుండా యాభై రూపాయిలు చేతిలో పెట్టాడు రవణయ్య. 'అమ్మాయ్, నేను పనికిమాలినోణ్ణయిపొయ్యాను. మీ అందరికీ బరువు సేటయ్యాను. మొగోడూ ఆడదీ గూడా మీ యమ్మే అయ్యి అన్నీ సూసుకుంది.........నా సేతనయ్యింది యింతేనమ్మా. పెట్టిడగు నెట్టుకో' అన్నాడు. రాగమ్మకి ఏడుపొచ్చింది. 'బాబూ, నువు శానా మంచోడివి' అన్నది ఏడుస్తూ. రవణయ్యకి సంతోషం కలిగింది. సన్నగా వుండి ఎముకలు పొడుచుకొస్తున్నట్టున్న కూతురి భుజం చుట్టూ చేతులేసి దగ్గిరికి లాక్కుని తడుముతూ 'అమ్మాయ్, నాకు సేతనయ్యింది నేను సేస్తుంటాను. నీకేమన్నా కావాలంటే సెప్పంపు' అని ఓదార్చాడు.

* * *

'మంచి సమ్మంధం' అని సుబ్బమ్మ మురిసిపోయిందిగాని రాగమ్మకి అత్తగారింట్లో సుఖం కనబడలేదు. మనసులో ఏమిటో గుబులుగా భయంగా ఉంటోంది. శేషమ్మ సూటీ పోటీమాటలు ఎత్తిపొడుపులూ రాగమ్మని తికమక జేసేస్తున్నాయి. 'కూలోళ్లు, అడుక్కునేవాళ్లు, బురదగుంటలో వుండేవాళ్లు' అంటూ యిరుగు పొరుగుల్తో చెప్పి ఎద్దేవా చేసేది. రాగమ్మ తిరుగు మాట్లాడలేకపోయింది. ఎందుకు వీళ్లు అట్టా హీనం చేస్తున్నారో తెలియలేదు. తమ వూళ్లో ఉన్నప్పుడు పొయ్యిలోకి పుల్లా కంపా ఏరుకోడానికి తన యీడు పిల్లల్తో కలిసి కాస్తవతల బ్రిడ్జి దగ్గరకువెళ్తే అక్కడ పచ్చటి చేలూ దూరాన్న వెండిలాగా మెరిసిపోతూ పారే మలిదేవీ, పెద్దరెడ్డిగారి కొబ్బరితోటా చుట్టూ ఎంతో

దంగా ఉండేవి! ఈ నెల్లూళ్లో ఏముంది, యీ పక్కిల్లూ, ఆ పక్కిల్లూ! అనుకున్నది 'మా బాబు ఎంత మంచోడో యీళ్ల కేం తెల్సు. కళ్ళు బాగున్నప్పుడు వన్నె వన్నెల సీరలు ఎన్ని నేసాడు. రెక్కలు ముక్కలు సేసుకున్నాడు గుడ్డోడైపొయ్యాడు. అయితే ఏం? రోజూ కోవటికొట్లోనో వోటల్లోనో ఏదో ఒక తీపి మిఠాయి తెచ్చిపెట్టేవాడు. అడక్క తింటుండారా అని అమ్మ నానా తిట్లూ తిట్టేది. ఎవరికి తెల్సు. మా బాబూ నేను ఒకటి' అని తనకు తానే సర్దిచెప్పుకున్నది. కాని రాగమ్మలోని చైతన్యం గుండెల్లో ముడుచుకుపోయింది. ఏపుగా పెరుగుతున్న మొక్కను పీకి కంకర నేలలో పెట్టినట్లైంది.

తిరువెంగడం బ్రతికున్నన్నాళ్ళూ ఆ యింట్లో బాగా జరిగింది నాలుగువేల పెట్టుబడిమీద నూలు తెచ్చి రకరకాల అంచులతో రంగుల చీరెలూ చారల చీరెలూ— ఆ రోజు మోజునుబట్టి నేయించి అమ్మేవాడు రోజుకు పదీ పదిహేను మగ్గాలవరకూ పని చేయించేవాడు. పెద్ద ఖాతాలు గట్టిగా పెట్టుకున్నాడు. కూలిపోనూ మగ్గానికి సరకును బట్టి అయిదునుండీ పదివరకూ గిట్టేది అరెకరం మాగాణిలో పూరింటితో మొదలుపెట్టిన వ్యాపారస్థుడు పదేళ్ల కాలంలో అయిదెకరాల మాగాణి, మిద్దె యిల్లూ సంపాదించాడు చదువు మీద శ్రద్ధలేక ఆరోక్లాసు చదువుతూ చాలించిన శంకరం సినిమాలూ షికార్లతో కాలం గడుపుతుండగానే తండ్రి దగ్గర పని నేర్చుకోక మునుపే ఒకనాటి రాత్రి చీకటి పడ్డాక చేల్లోనుండీ వస్తున్న తిరువెంగడానికి చెడ్డ తేలు కుట్టి ఆసుపత్రికి పోయేదోవలోనే చావు వచ్చింది. .. రాబడి తగ్గిపోయింది ఖర్చులు తగ్గలేదు. శేషమ్మది భారీ చెయ్యి పిండి వంట చేసినప్పుడు గంపనిండా చెయ్యాల్సిందే. పలకరించను వచ్చినవాళ్లకీ యిరుగు పొరుగులకీ తలా కాస్త పంచాల్సిందే. లేకుంటే ఆమెకు తోచదు. 'మీకేమమ్మా, కూర్చుని తినగలవాళ్లు' 'నీ చేతి వంటేవంట' అని వాళ్ళూ వీళ్ళూ అంటూంటే సంతోషంతో పొంగిపోతుంటుంది. చూస్తూండగానే వచ్చేపోయే చుట్టాలతో లన్నీ అత్యవసరమనిపించే అనేకమైన ఖర్చులతో యీ ఏడెనిమిదేళ్లల్లో నాలు గెకరాలు అమ్మడు పోయింది. మిగిలిన ఎకరం మాగాణి తనఖా క్రిందకు పోయింది. పెళ్లికోసం యింటిమీద మూడు వందలు అప్పు తెచ్చారు. అయినా పులుసూ, చారూ అంటూ, పట్టకెళ్లడానికి చిన్న చిన్న గిన్నెల్తో రోజూ ఒచ్చే వాళ్లున్నారు. గంపలో యిడ్లీలు అమ్మే సీతమ్మ రోజూ ప్రొద్దున్నే రావలసిందే. కాఫీ లేకపోతే రోజు గడవదు. ....

'రాగాం, పిండి రుబ్బెయ్యవే.... అన్నంలోకి నాలుగు గారెలు కాలుస్తాను' 'నా బిడ్డకి నీళ్ళు మసిలిపోవాలే ... ఇంకా రెండు కట్టెలు పెట్టి బాగా కాయి.....' 'ఇవాళ కోవూరు చుట్టాలు వొస్తామన్నారు. పైనుండే పెద్ద దబరాలు దించి శుభ్రంగా తోమి పెట్టు . కాసిని శనగపప్పు ఉడకేసి బెల్లంవేసి పోళీలు కాలుస్తాను......' ఈ పురమాయింపులు యిళ్ల పనులు చేసిన రాగమ్మకు క్రొత్తాకాదు కష్టమూ కాదు. కాని ఎందుకో అక్కడికీ యిక్కడికీ తేడా వున్నది. రాగమ్మకు బెంగ పట్టుకున్నది ఇల్లు దాటి నాలుగడుగులు వేస్తే కళ్లనిండుగా కన్పించే చేలూ, తోటలూ, అమ్మకోపాలూ, బాబు ముద్దూ— అన్నీ గుండెల్లో నిండిపోయి ఏ పని చేసినా వుల్లాసంగా వుండేది. అన్నిటికీ పూరికే నవ్వొచ్చేది. - యిక్కడ అట్లాగ కాదు. బ్రతుకు బ్రతికినట్లు కాకుండా దానంతటదే నీరసంగా గడిచి పోతున్నట్లుంటుంది.

శంకరయ్య తన అవసరాలకు మించిన మిగతా విషయాలన్నీ నిశ్చింతగా తల్లిమీద ఒదిలేస్తాడు. 'నువ్వేదైనా పని చూసుకోకపోతే జరగదురా' అని శేషమ్మ కొడుకుతో అప్పుడప్పుడు చెప్తూనే వున్నది. 'సూస్తావున్నా..... సూస్తావున్నా' అంటాడు శంకరయ్య.

రోజూ వచ్చి చిన్న గిన్నెతో కూర పట్టుకెళ్లే తులిశప్ప ఒకనాడు నీ కోడల్ని నాతోపాటు కూలిపనికి పంపరాదూ' అన్నది. శేషమ్మ కళ్ల నీళ్ళు పెట్టుకుంది. 'నవ్వండమ్మా, నవ్వండి. మీ యిచ్చ వచ్చినట్లు నవ్వండి. తెలియకపోయి యీ సంబంధం కట్టుకొచ్చాము.. కూలి పనికీ రమ్మంటావు. ఇళ్ల పనికీ పొమ్మంటావు' అన్నది. తులిశప్పని చూస్తేనే రాగమ్మకి భయం. మాట మామూలుగా మాట్లాడుతూందో ఎద్దేవా చేస్తుందో కనుక్కోనివ్వకుండా మాట్లాడుతుంది.

ఒకనాడు రాత్రి శంకరయ్య సినిమా కెళ్లాలని తొందరగా అన్నం తింటూవుండగా శేషమ్మ పని మాట కదలేసింది. 'అయిస్కూల్లో జవాను పని కాళీ వుందంట గాని ఎడ్మాస్టర్లోళ్లకి యింట్లో పనికి మనిషి కావాలంట జవాను యింటో ఆడమనిషి ఆరికి పని చెయ్యాలంట' అన్నాడు.

'ఎంతిస్తారు జీతం?' అనడిగింది శేషమ్మ ఆత్రంగా:
'వంద' అన్నాడు శంకరం అన్నం గబ గబా నమిలేస్తూ.

శేషమ్మ కాసేపు మాటా పలుకూ లేకుండా వుండి 'ఆ పనికీ యీ పనికీ ఒంకేమి టంటా .....' అన్నది. మళ్లీ 'యీ పనన్నా దొరికితే కాస్త గట్టెక్కినట్టు' అన్నది రాగమ్మ వైపు చూస్తూ. రాగమ్మ మాట్లాడలేదు. 'ఏవన్నా అవనీ, నాకేం' అనుకుంది. శంకరయ్య సినిమా కెళ్లాడు. ఆ ఉద్యోగం మాట వాయిదా పడిపోయింది.

* * *

ఇంతలో రాగమ్మ గర్భవతి అయింది. మనవడు పుట్టబోతున్నాడని శేషమ్మ చాలా హడావుడి చేసింది. అందరితోనూ ఆ విషయమే మాట్లాడేది. రాగమ్మకి మాత్రం ప్రత్యేకంగా ఏమీ అనిపించలేదు. నల్లగా సన్నగా ఎలుక పిల్లలా వున్న కొడుకుని చూసినప్పుడూ ఏమీ అనిపించలేదు. వాడికి సినిమా నాగేశ్వరరావని పేరు పెట్టాడు శంకరయ్య. వాడికి ఆకలయినా చలేసినా కళ్ళు గట్టిగా మూసుకుని మొహమంతా సొట్టలూ మిట్టలూచేసి నోరంతా తెరిచి వోపికకొద్దీ అరవటమూ, నల్లటి

చిన్న నోటితో పాలకోసం ఆత్రంగా తడుముకోవటమూ చూసి 'పిచ్చెదవా, నీకేం తెలవదు' అంటూ నవ్వుకుంటూ గుండెల కదుముకున్నది రాగమ్మ. మూడోనెల పడ్డాక వాడు కడుపు నిండి ఆడుకుంటున్న సమయాల్లో తల్లి కనపడగానే గుర్తుపట్టి ఆనందంతో దవడలు నొక్కుకుపోయేట్లుగా చేతనయినంతగానూ తెరిచి, కాళ్ళూ, చేతులూ గాలిలో మరింత జోరుగా ఆడిం చేసి కళ్లతోనూ ఒళ్లంతటితోనూ నవ్వినప్పుడు 'నాగేశూ ఏందిరా అంత నవ్వూ' అంటూ వాడిని ముద్దుల్తో ముంచేసి వాడితో కలిసి నవ్వింది.

సుబ్బమ్మ వచ్చి మనవణ్ని చూసి రంగు రంగుల వాయిల్ చొక్కాలు నాలుగు, పౌడరు డబ్బా, సబ్బు బిళ్లా, కస్తూరి మాత్రలూ, పది రూపాయిలూ యిచ్చివెళ్లింది

రాగమ్మకి కాన్పు అయి కొడుకు పుట్టేసరికి అప్పు భూతంలా ఎదురైంది. ఇల్లు అమ్మెయ్యాల్సిన పరిస్థితి వచ్చింది.

'ఆ బళ్లో జవాను పని మళ్లీ కాళీ ఒచ్చింది. ఎవడో సాకలాడికిస్తే ఆడి పెళ్లాం యింటో పని సరిగ్గా సెయ్యకుండా అమ్మగార్నే ఎదిరిచ్చి మాట్టాడి, ఆడూ గండాగొండిగావుంటే తీసి పారేశారంట' అన్నాడు శంకరయ్య ఒకనాడు.

'అయ్యో పాపం. మరి సాకలోళ్లకి యిట్టాటి పనులకి ఒల్లొంగిసస్తదా. అదీ గాకుండా అట్లాటోళ్లకి అయ్యావార్లకి మనకి మల్లేనే ఇల్లు శుభ్రం, ఒల్లు సుబ్రం పని సుబ్రం ఉండాలి . ఎట్టాగైనా ఆ పనిలో చేరేట్టు చూడరా నాయినా' అన్నది శేషమ్మ.

మరునాడు మధ్యాహ్నం హైస్కూలు వాచ్‌మేనూ శంకరయ్యా వచ్చి రాగమ్మను హెడ్మాస్టరుగారింటికి తీసుకెళ్లారు.

'..... పని శుభ్రంగా ఉండాలి మీ ఎడ్డి మడ్డి పనులు మాకు పనికిరావు. ఒళ్లు దగ్గర పెట్టుకొని పని చెయ్యాలి రెండు పూటలా యిల్లు అద్దంలాగా తుడవాలి. మా యింట్లో వాడేది మామూలు చీపురు కాదు. పట్నంలో అమ్మే కుంచెలు.. వారానికోసారి యిల్లు కడిగి బిందెలూ కళాయిలూ తోమాలి దొంగతనం అన్నమాట వినపడకూడదు ....' హెడ్మాస్టరుగారి భార్య కఠినంగా హెచ్చరికలుచేస్తోంది

ఆమె కట్టుకున్న లేత ఆకుపచ్చ జరి అంచు వెంకటగిరి చీరెనూ ఆమె మాట్లాడుతున్న తీరునూ చూస్తూ నిల్చుంది రాగమ్మ. శంకరయ్య దారప్పోగుల్లాంటి జుట్టును మొహమ్మీద నుండీ పక్కకి పోయేట్లు తల ఎగరేసి 'పని బాగా సేస్తది లెండి' అన్నాడు. ఆమె సందేహంగా యిద్దరివేపూ చూసి 'సరే రేపు తెల్లారుజామున్నే ఒచ్చెయ్యి' అని చెప్పింది.

అన్నం లేదు. జీతం మూడు రూపాయిలు—బళ్లో యిచ్చే వందా కాకుండా.

*   *   *

నాగేశు పుష్టిగల పిల్లవాడు కాలేదు ఎప్పుడూ జలుబో జ్వరమో విరేచనాలో ఉంటూనే వుండేవి. శేషమ్మ అమ్మలక్కలందరి సలహాలతోనూ కస్తూరిమాత్రలూ సొంటిమాత్రలూ వాడుతూనే ఉంది. రెండు రూపాయిలకు గ్రైప్‌వాటర్ అనే పళ్ల రసం సీసా కూడా తెచ్చి వాడింది ఎవరో చెప్పగా. అయినా వాడికి ఒకటి తగ్గితే ఒకటిగా ఏదో ఒక నలత ఉంటూనే వుంది. 'ఏవిటో, మారకం గాదు. వాళ్లమ్మసొలు' అన్నది శేషమ్మ విసుగు పుట్టి.

ఒకసారి జలుబూ విరేచనాలూ రెండింటిలోనూ జ్వరం ఫెళ్ళున కాస్తూ పిల్లవాడు తల్లక్రిందులయిపోతుంటే రాగమ్మ పనినుంచీ తొందరగా వచ్చి వాడిని వూరి కాచివర వున్న ధర్మాసుపత్రికి తీసుకెళ్లింది రెండు గంటలసేపు నిలబడ్డాక డాక్టరు చూసి ఇంజక్షను రాసిచ్చాడు. అది వేయవలసిన నర్సు ముఖంలో చిటచిటలతో, 'ముందుగానే రాకూడదూ' అంటూ రుస రుసలతో సూదిలో మందు తెచ్చింది. 'పిల్లాడి కాళ్ళూ, నడుమూ కదలకుండా గట్టిగా పట్టుకో' అన్నది ఆవిణ్నీ సూదినీ చూసి అర్థంకాక తల్లిని కరుచుకుపోయాడు నాగేశు. రాగమ్మకి గుండె దడదడలాడింది నాగేశు వీపుని ఒక చేత్తోనూ, కాళ్లను ఒక చేత్తోనూ గట్టిగా కదలకుండా పట్టుకుంది నర్సు సూదిని ఒక్క వూపుతో లోనికి గుచ్చింది అది లోపలికిపోయి ఫట్‌మని విరిగింది 'పిల్లాణ్ణి కదలనివ్వద్దంటే మొద్దుమాదిరి నిల్చున్నావు' అంటూ తిడుతూ బయటికి కన్పిస్తున్న కొనని పట్టుకుని సూదిని బయటకు లాగింది నర్సు ఇంకో సూది తెచ్చి దానితో మందు ఎక్కించింది నాగేశు గిలగిల్లాడిపోయాడు. రాగమ్మకు ఒళ్లంతా చెమటలు పోసినై. కొడుకుని గట్టిగా కావిలించుకొని ధర్మాసుపత్రిలోనుంచీ బయటబడింది మళ్లీ ఆ ఛాయలకు వెళ్లడానికి ధైర్యం చాలలేదు.

నాగేశుకి ఒంట్లో బాగా లేనప్పుడు రాగమ్మ పనికెళ్తుంటే ఏడ్చేవాడు. మరీ ఏడ్చినప్పుడు చంక నేసుకు తనతోటే తీసుకెళ్లేది. వాడిని ముందు వరండాలో ఒక ప్రక్కగా విడిచిపెట్టి తన పని చేసుకునేది. ముక్కులోనుండి నోట్లోకి చీమిడి కారుతుంటే నోట్లో నాలుగు వేళ్లు వేసుకుని ఒళ్లంతా చొంగ కార్చుకుంటూ ఓ ప్రక్కగా గోడవారగా కూర్చొని పెద్దకళ్లతో బయటకీ లోపలికీ తిరిగే పిల్లల్నీ పెద్దల్నీ చూస్తూ కూర్చునేవాడు మధ్యమధ్యన రాగమ్మ వచ్చి తన చీరకొంగుతో వాడి ముక్కు తుడిచి, మొహమ్మీద పడే దూది లాంటి ప్రాణంలేని జుట్టును పైకి సర్ది ముద్దు పెట్టుకునేది. తల్లిని చూడగానే వాడి మొహంనిండా సంతోషం పాకిపోయేది. రాగమ్మ అటు వెళ్లగానే యథాప్రకారం వచ్చేపోయే వాళ్లను చూస్తూ కూర్చునేవాడు. సన్నగా నల్లగా వున్న ఆ చీమిడి ముక్కు పిల్లవాడిని చూడగానే అమ్మగారికి చీకాకు వచ్చేది. 'ఈ జలుబులూ విరేచనాలూ జ్వరాలూ వుండే పిల్లవాడిని పిల్లలుండే యింట్లోకి తెచ్చి ముందర పెడితే ఎలాగే, రాగాం. ఏం, కాసేపు యింట్లో వుండ లేడంటనా?' అని కేక లేసేది ఒక్కోసారి.

ఆ ఏడాది నాలుగుసార్లు పెద్ద తుఫాన్లు వచ్చినై. మంచి కోతల సమయంలో వచ్చిన గాలి వాన పంటల్ని చాలావరకు నాశనం చేసింది. ఆకాశం రెండు నెలలపాటు మూసుకుపోయే

వున్నది. సూర్యుడు బలహీనంగా కాంతి లేకుండా కాసేపు కనబడి మాయమై పోయేవాడు. నాగేశు యీ రెండు నెలలూ నలతగానే వుండి మరీ చిక్కిపోయాడు. రాగమ్మ మనసుకు మబ్బు కమ్మేసినట్లయి ఏవిటో మూగ బాధగా వుండిపోయింది.

'ప్రపంచానికే ప్రళయకాలం వచ్చినట్లుంది. మనుషులు మంచీ చెడ్డా మర్చిపోయి డబ్బు మోజులో పడిపోయారు. కాకపోతే యీ తుఫాను లేమిటి సూర్యుడే కనబడకపోతుంటేనూ' అనుకుంటున్నారు ముసలివాళ్ళూ, పాతకాలపు వాళ్ళూను.

ఇటువంటి సమయంలోనే వూళ్ళో అక్కడక్కడా పిల్లలకు చెడ్డ జ్వరాలు తుగులుతున్నాయని తెలిసింది. నెలగడిచేసరికి పిల్లలుండే వాళ్ళందరికీ మాట్లాడుకోవడానికి అదే ముఖ్య విషయమై పోయింది. హెడ్మాస్టరుగారి మూడేళ్ల కూతురికీ తొమ్మిదేళ్ల కొడుక్కూ ఆ జ్వరం రాకుండా ఉండడానికి ముందుగానే ఏదో మందు వేయించారు. 'నీవు కూడా వేయించరాదూ జబ్బు రాకుండా వుంటుంది' అని రాగమ్మకి సలహా యిచ్చింది అమ్మగారు. రాగమ్మ యింటికొచ్చి చెప్పింది అది డబ్బు ఖర్చుతో కూడుకున్న పని.

'ఏం మందులో. పూర్వకాలంలో యిట్టాటివన్నీ వేసి పిల్లల్ని పెద్ద జేశావా? ఆ మందులన్నీ కలిసి అసలే అబ్బనాకారపు వాడికి ఉడుకు జేస్తయి' అన్నది శేషమ్మ.

'సూద్దాంలే' అన్నాడు శంకరయ్య.

అక్కడో పిల్లాడు పోయాడనీ యిక్కడో పిల్లకు కాళ్ళు పడిపోయాయనీ వార్తలు విన్న రాగమ్మ శంకరయ్యని మళ్లీ హెచ్చరించింది

'మేం అయ్యన్నీ లెక్క తేసుకున్నాం. తడవకు అయిదు రూపాయిల లెక్కన మూడు తడవల మందుకీ పదేసి రూపాయి లౌతాయి. అంతకంటే జెరం తగిల్తే మందుకి తక్కవవుతది. వాస్మేనూ, సీపరూ అందరూ అట్టనే అంటుండారు. ఇప్పుడు డబ్బు గూడా సేతిలో లేదు' అన్నాడు.

నెల తిరిగే సరికి నాగేశుకి ముమ్మరంగా జలుబు చేసింది. రెండు రోజులు జ్వరం తగిలింది. కాళ్లు చచ్చుబడి పోయాయి.

'అయ్యో దేవుడా యిదేం కాలమో. యీ కొత్త రోగాలేమిటో మేం ఎరగం యిట్టాటివి. ఈ అక్కుపచ్చి పిల్లాడికి యిదొకటి పెట్టాడమ్మా దేవుడూ?' అంటూ అందరికీ చెప్పుకొని శోకాలు పెట్టింది శేషమ్మ.

శంకరయ్యకు అసలా విషయమే పట్టలేదు.

బాగా తిరిగి ఆడుకుంటున్న పిల్లవాడు కదల లేకుండా మంచం మీదనే వుండి పోవటం రాగమ్మకు కష్టంగా వున్నది. మంచం మీద పడుకుని పీక్కుపోయిన మొహంలోంచీ మరీ పెద్దగా కనబడే కళ్లతో అందర్నీ పూరికే చూస్తూ పడుకునేవాడు తల్లిని చూడగానే వాడి మొహంనిండా నవ్వు విరిసేది. రాగమ్మ కూడా నవ్వేది. 'ఒరే నాగేశూ, నీకు బాగయినాక నాతోపాటు అమ్మగారింటికి తీసుకెల్తా లేరా' అని చెప్పేది. జబ్బు చేసినప్పటి నుండీ వాడంటే రాగమ్మకు మరీ ప్రాణమై పోయింది.

నెల్లూరికి యిరవై మైళ్ళలో వుండే పల్లెనుండి శేషమ్మ అక్క పిల్లవాడిని చూడటానికి వచ్చింది. పది రోజులుండి గుడ్డలు కుట్టించుకుని కావలసిన సరుకులన్నీ కొనుక్కొని సినిమాలన్నీ చూసి తిరిగివెళ్తూ 'మా వూళ్ళో ఆయుర్వేద వైద్యుడు గున్నాడు. శానామంది సచ్చురోగాలాళ్ళు ఆయన దగ్గరికి పోతండారు. వీడిని గూడా తీసకపోయి సూపిద్దాం' అన్నది.

ఇరవై రూపాయిలు చేత బట్టుకొని మనవణ్ని ఎత్తుకొని బయల్దేరింది శేషమ్మ. వాడు వెళ్తుంటే రాగమ్మకి చెప్ప లేని దిగులు వేసింది 'నేనూ ఒస్తా' నన్నది

'ఇంటో ఎవ్వరూ లేకుండానా? ఎడ్మాస్టరు అయ్యవారింటో పని మానెట్టా? అంతగా అయితే మళ్లీ ఒద్దువుగాని' అన్నది శేషమ్మ.

నాగేశు వెళ్లినప్పట్నుండీ కాలూ చెయ్యీ ఆడక మతి పోయినదాన్లా వుండిపోయింది రాగమ్మ. ఇంట్లో కూడొండతున్నా, అయ్యవారింట్లో పని జేస్తున్నా 'వాడేం జేత్తన్నాడో. ఎట్టా గున్నాడో. నే లేనని బెంగపడ్డాడేవో' అనుకునేది.

పది రోజులు తిరక్కుండానే ఆ వూరినుండి నాగేశు పోయాడనీ వెంటనే రమ్మనీ కబురొచ్చింది రాగమ్మ ఆవురావురంటూ ఏడ్చింది కడుపులో ఏడుపు పొర్లుపొర్లుగా వస్తుంటే కుళ్లి కుళ్లి ఏడ్చింది. శంకరయ్య అప్పటికప్పుడు రెండు రోజులు శలవడిగి వచ్చాడు. బస్సులో కూడా ఏడుస్తూనే వుంది రాగమ్మ. నోట మాట మాత్రం రాలేదు. పచ్చి మంచి నీళ్లు గూడా ముట్టలేదు. పిల్లవాడు కనబడగానే కట్టెలాగా నిగుడుకుపోయిన వాడిని గుడ్డలతోటే ఎత్తుకుని గుండెల కదుముకుంది శోకం పొంగు తగ్గుతూవుండగా 'వాసన గొడతన్నాడు. తరవాత పని కానియ్యా'లని బలవంతాన రాగమ్మ దగ్గర్నుండీ పిల్లవాణ్ణి లాక్కున్నారు మీద గుడ్డ లేకుండా చేసి టవలులో చుట్టుకుని శంకరయ్య భుజాన వేసుకున్నాడు మొగవాళ్లంతా వెళ్లిపోయారు. తెలివి లేకుండా బిళ్ల బీటుగా పడిపోయింది రాగమ్మ ...

* * *

ఇంటి కొచ్చాక రాగమ్మకి బ్రతుకంతా అయోమయం అయిపోయినట్లయింది. 'అమ్మా బాబూ దగ్గరుంటే బాగుండు' ననిపించింది. ఎవరిమీదో చెప్పరాని కసి పుట్టుకొచ్చింది. బలహీనంగా చూసే వాడికళ్లూ రోగంతో వాడిపోయిన ఒళ్ళూ కళ్లముందున్నట్లే వుండేవి. దూదిలాగా మెత్తగా ప్రాణంలేకుండా వుండే వాడి జుట్టు చేత్తో లాకినట్లే వుండేది 'వాడు ఎవరి కేపకారం జేశాడు? ఎవ్వరికి బరువయ్యాడు? కాళ్ళు లేకపోతేనేం, నా కడుపులో పెట్టుకు కాపాడుకునేదాన్ని. భగవంతుడికి నాయం లేదు' అనుకున్నది.

శంకరం పనిలో చేరగానే 'అది నాలుగు రోజులు రాకపోయినా పర్లేదు. అమ్మగారు నిన్ను రమ్మన్నారు' అంటూ శేషమ్మని

హెడ్మాస్టరుగారింటికి తీసుకెళ్ళాడు. 'నాలుగు రోజులే కదా' అని మనసు గట్టి జేసుకుని విధిలేక బయల్దేరింది శేషమ్మ. శుభ్రంగా గులాబీపువ్వులా వున్న చలవరేకు కట్టుకుని నున్నగా తల దువ్వి కొప్పు పెట్టుకుని తెలిసిన వాళ్ళింటికి వెళ్లినట్లు వెళ్లింది. అమ్మగారితో కబుర్లు చెబుతూ నిదానంగా పని చేసుకుని ఆలస్యంగా యింటి కొచ్చింది. చాటంత మొహంతో 'అమ్మగారు బలే మంచిది. ఎంత బాగా మాట్లాడుతుంది!' అంటూ ఒక గిన్నెడు పులుసూ మజ్జిగా తెచ్చింది. నాలుగు రోజులయ్యాక 'చచ్చు రోగం వచ్చినవాడు పోయిందే వాడికి హాయి. వూరికే కూచుంటే మరీ దు:ఖం. రాగాంని పనిలోకి రమ్మను రేపట్నుంచీ' అన్నది అమ్మగారు అంటూ ఆవిడిచ్చిపంపిన పాత చీర తెచ్చింది. పెద్ద ఎఱ్ఱ చుక్కలుండే గులాబీరంగు వాయిల్ చీర. ఆమె ఆ చీర కట్టుకు తిరుగుతుంటే ఆ రంగుల్ని కన్నార్పకుండా చూస్తూ వుండేవాడు నాగేశు అన్న సంగతి గుర్తు కొచ్చింది రాగమ్మకి. అప్పుడు ఆమె నాగేశుని చీదరించుకున్నది. ఇప్పుడు వాడు పోయాక ఉదారంగా చీర యిచ్చి పంపింది. 'ఎవరుక్కావాలి. ఎదవసీర' అనుకున్నది. 'నే నింగ ఆ పన్లోకి పోను' అన్నది.

శేషమ్మకి చాలాకోపం వచ్చింది. లోకంలో మనకేనా కష్టం వొచ్చింది? ఏం అంత అబ్బురం!' అంటూ విసుక్కుంది.

ఇంకో పది రోజులకు పదిసార్లు రాగాంని రమ్మని చెప్పి పంపాక అమ్మగారికి కోపం వచ్చింది.

'ఏదో ఒక వంక పెట్టుకుని ఇంట్లో పనిఎగ్గొట్టి వుద్యోగం మిగిలించుకుందా మనుకున్నారా? ఈ శేషమ్మ మాకు పనికిరాదు. ఎంతసేపూ లోకాభిరామాయణం మాట్లాడుకుంటూ యీడ్చుకుంటూ పనిజేస్తుంది. పైగా కూరలు కావాలి. అన్నం కావాలి గుడ్డలు కావాలి. అన్నిటిమీదా ఆశే. రాగాం ఒస్తే ఒచ్చినట్లు. లేకపోతే నీ వుద్యోగం పోయినట్లే' అని ఖండితంగా చెప్పింది శంకరంతో.

నాగేశు పోయాడని వార్త తెలిసి సుబ్బమ్మ వచ్చింది. తల్లిని చూడగానే రాగమ్మకి ఒక్కసారిగా దు:ఖం కట్టలు తెంచుకుంది. తల్లిని కావిలించుకుని ఒకటే ఏడుపు.

'బగమంతుడికి యింత పెపంచంలోనూ వాడే బరువయ్యాడే. బగమంతుడికి నాయం లేదు. వాడు లేకుండా నేనెట్టా బతికేది? నేనూ చచ్చిపోతానే' అంటూ బావురు మన్నది.

సుబ్బమ్మ కూతురి తలా వీపూ నిమురుతూ కళ్ల నీళ్లు పెట్టుకుంది. 'సాల్లే వూరుకో. ఇంత పెపంచకంలో కట్టం లేనోళ్ళున్నారా? అందరూ బతకటంలా? కడుపుతీపి ఆ నిమిసాని కట్టా అనిపిస్తది. బగమంతుడిని తప్పుపట్టేవాళ్లమా మనం?' అంటూ గట్టిగా కేకలేసింది.

'నోరు లేదు గాని వాడికుండే బెమత ఎంతదని? మనిసి కనబడగానే ఎంత సంబరం బడిపొయ్యేవాడు? ఎఱ్ఱినాయన! ఏ అద్దంరెత్తిరి మెలకూ ఒచ్చినా అప్పుడు నా కడుపులోకి దూరి సీరకొంగు మొగాన కప్పుకుని నిద్రబొయ్యేవాడు. ఎక్కడున్నాడో. ఏం జేత్తున్నాడో' అన్నీ వైనవైనాలుగా తలచుకు తల్లితో చెప్పుకున్నాక రాగమ్మకు గుండెల్లో బరువు కాస్త తెరిపి యిచ్చినట్లయింది.

మానవుని బాధ ...

కుష్ఠు రోగము

కుష్ఠము భయంకరమైన వ్యాధి యని చాలాకాలముగా ప్రపంచ మెరిగినది. విశేష సంబంధ అనుభవమువల్లనే అంటువ్యాధి ఆనవచ్చును. అది మెల్లిగా ప్రబలుచున్నది. మంచి యోచనతో తక్కువ కా°°ముల వల్ల వాటిని ఖండించవచ్చును.

ఈ వ్యాధియొక్క మొదటి ఆనవాలు దేహమందు ముఖ్యముగా చెవులపై ఏర్పడును. చిన్న చిన్న కురుపులు లేక పొడలు, ఇవి ముక్కునందును, మోచేతియందును తొడలలోను ఏర్పడును. పిదప దేహమంతయు నల్లనగును. కురుపులు పెద్ద పుండుగా మారున. కుష్ఠము నరములను కూడా పీడించును. అందువల్ల నరములు ఆ వ్యాధికి లోనై తన శక్తిని పోగొట్టుకొనును. పొడుపు బాధ కూడ ఏర్పడవచ్చును.

చర్మ సంబంధము :—దేహముపై ఎఱ్ఱని వర్ణముగల పొడలు, దద్దులు ఏర్పడుట, పొడువు, బాధ, గజ్జి మొదలైనవి. నరముల సంబంధము:—పొడలుగలచోట్లలో తిమురు కలుగుట, దుర్నీరు, సర్వ అవయవములందు వ్యాపించి రక్తమునందు కలిసి మత్తు కలుగజేయును. సూదితో పొడిచినను బాధ కనబడకుండుట, చేతివ్రేలు ముడుచుకొనుట, ముక్కు బంధనములు మొదలైనవి. అస్థి సంబంధము:—పాదమునందు వల్లపు పుండు ఏర్పడుట, కాళ్ళు, చేతులు, వ్రేళ్ళు తగ్గుట, చూచువారికి విసుగు జెందునట్లు మరికొన్ని బాధలు యుండును.

కుష్ఠమునకు అనేక ఔషధములు తయారు చేయడమైనది ఇంకను తయారు చేయుటకు ప్రయాసపడుచున్నాము. పూర్వముననే హిందూదేశమున మాత్రము సిద్ధ ఆయుర్వేద భాగమున కుష్ఠరోగమునకు ఔషధము కనిపెట్టబడి జయము నొసంగుచు వచ్చుచున్నది పిట్లు మా యొక్క "మేల్ మాయిల్ మందు" మిక్కిలి శ్రేష్ఠమైన మూలికలు వగైరాలతో సిద్ధ ఆయుర్వేద భాగము ననుసరించి మా యొక్క 'మేల్ మాయిల్ మందు' తయారు చేయబడుచున్నది ఈ కఠిన వ్యాధివల్ల బాధపడు మానవులు మా 'మేల్ మాయిల్ మందు' ను సేవించి బాగుపడి భగవత్ కృపకు పాత్రులగుదురుగాక

సిద్ధ డాక్టర్ కే.టి. కృష్ణమూర్తి ఆచ్చారి గారి

మేల్ మాయిల్ మందు

ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచిన మేహ, కుష్ఠు రోగ నివారిణి

——: వివరములకు వ్రాయండి :——

కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారి అండ్ సన్సు,

5/22, మేల్ మాయిల్ (వయా) కాట్పాడి (N. A. Dt.)

'ఇప్పుడు మంచి రోజులు గాదు సుక్కోదు రంటుండారు. మూడో నెల్లో మీ యిద్దర్నీ యింటికి తీసుకెళ్లి గుడ్డలు పెడతాను. అందాకా ధైర్యంగా వుండు. నీ బాబు నువ్వెట్టుండావో నని మరీ బెంగెట్టుకున్నాడు' అని చెప్పి వూరి కెళ్లిపోయింది సుబ్బమ్మ.

వుద్యోగం పోయేసరికి అప్పులవాళ్లు బాకీలు తీర్చమని తొందర పెట్టారు. విధిలేక యిల్లు అమ్మి అప్పులు తీర్చి తులిశప్ప యింటిదగ్గరగా ఒక అద్దెయింట్లోకి మారారు. చిన్న పూరిల్లు అద్దె నెలకి ఆరు రూపాయలు. సొంతయిల్లు పోయినందుకు శేషమ్మ కడుపు తరుక్కుపోయినట్లుగా ఏడిచింది. అప్పట్నుండీ సగంప్రాణం పోయిన దానిలా వుండిపోయింది.

'ఎంతటి సంసారం ఎంతట్లోకి దిగజారి పోయింది! కోడలు కాలు మోపినప్పట్నుండీ అంతా ముదనష్టం అయిపోయింది. శివాలయంలో నవగ్రహాలకు శాంతిచెయ్యించాలి' అన్నదిగానిచేయించలేదు.

శేషమ్మకి డబ్బుకి కటకట అయిపోయింది. ఏమీలేనివాళ్లని ఎవరూ అప్పు లివ్వడం లేదు. ఇంట్లో గింజ గూడా లేని రోజు వచ్చింది. "ఏరా శంకరం, యీ పూటకి యింటో గింజ లేదు! ఏం జేసేదిరా' అంటూ తలపట్టు క్కూచుంది శేషమ్మ.

'ఏదన్నా పని కాళీ పడద్దని సూస్తా వున్నా అందాకా ఎట్టనో' అన్నాడు శంకరయ్య.

శంకరయ్య ఉద్యోగం పోయినప్పటి నుండీ శేషమ్మ కోడలితో మాట్లాడటం మానేసింది. నాగేశు పోయినప్పటినుండి అత్త మొహం చూడాలని బుద్ధి పుట్టలేదు రాగమ్మకు. ఇప్పుడు ఏమీ చెయ్యలేని పరిస్థితిలో ఎదురెదురుగా కూర్చుండిపోయిన తల్లీ కొడుకుల్నీ చూస్తే రాగమ్మకి నవ్వుతోబాటు జాలి కలిగింది.

ఉన్నట్టుండి ఒక రోజున చలికాలపు చీకట్లు పలచబడి పోయాయి. మాఘమాసంలోనే వసంతం ప్రవేశించింది. ముదిరి వాడిపోయిన మురికి ఆకులొత్తి ముసలిదాన్లా కనబడుతున్న వేపచెట్టు అక్కడక్కడా సన్నటి చిగురుటాకులు వేసింది. ఒడిలి పలచబడిపోయిన సన్నజాజి పొద లేతాకు పచ్చకొనలువేసి కాంతి పుంజుకొంటోంది. సాయంత్రాలు సంజెచీకట్లు ఒక్కసారిగా ముసురుకు రాకుండా నిదానంగా అదంగా ఆకాశంనుంచీ దిగుతున్నాయి. సూర్యుడు కాస్త తెల్లబడేప్పటికే పగలంతా చీకటి గుయ్యారంలా వుండే పూరిల్లు లేత వెలుగుతో నిండిపోతోంది. మనుషుల మనస్సుల్లోని చీకట్లు తొలగి ఆశా ఉత్సాహమూ నిండినట్లయి తేలిగ్గా వూపిరి పీలుస్తున్నారు.

తులిశప్ప తన కట్టలోని కూలీలందర్నీ కేకేసుకుంటూ పోతోంది వీధిలో 'తెల్లవయింది. రండమ్మోవ్' అంటూ. రాగమ్మ లేచి వీధి మొగలో అందరూ పోగవుతున్న చోటికి వెళ్లింది.

'నేంగూడా ఒస్తాను యియ్యాల' అన్నది తులిశప్పతో.

తులిశప్ప నవ్వి 'అట్టనే, రా అన్నంబెట్టి రూపాయన్నర కూలి' అన్నది.

రామిరెడ్డిగారి తూర్పు పొలానికి ఆరుగురితో కలిపి పంపింది రాగమ్మని. 'రవణమ్మా, రంగయ్యా మీరు కాస్త ఆ రాగమ్మని సూసుకోండి. అలవాటు లేదు. నలుగుర్తోపాటుగా ఎక్కి రాలేదేమో నాలుగు రోజులు. సర్దుకు పోండి' అని చెప్పి వప్పగించింది.

అందరితో కలిసి వూరి బయట పొలాల మధ్యన నడుస్తున్న రాగమ్మకి వూపిరి పీల్చుకున్నట్లయింది.

'ఈ పెపంచంలో మంచినిబెట్టిన బగమంతుడే సెడ్డనీ బెట్టాడు. సెడ్డని బెట్టిన బగమంతుడే మంచినీ బెట్టాడు. ఆయన నాయం మనకేం దెల్సు. పెట్టింది అనుబవించటమే మహాంతు' అనుకుంది యిరవై యేళ్లు నిండని రాగమ్మ.